

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 2 నవంబరు 2024 | 3






సామర్లకోట భీమేశ్వరాలయంలో...



అన్నవరంలో...



పుల్లేటికుర్రులో ప్రత్యేక అలంకరణలో వ్యాఘ్రేశ్వరస్వామి

ద్రాక్షారామ భీమేశ్వరాలయం



రాజమహేంద్రవరంలో గోదావరి ఘాట్

4లో..

ఆధ్యాత్మిక.. ఆనందం

ఆరనీకుమా ఈ దీపం.. కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూర దీపం.. కార్తీక మాసం అంటే అంత ప్రత్యేకత మరి.. కార్తీక మాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాలకు అనంతమైన పుణ్యఫలితాలు వస్తాయని కార్తీక పురాణం చెబుతోంది.. అందుకే ఏడాదంతా ఎలా ఉన్నా.. ఆ శివయ్యను ప్రసన్నం చేసుకునేందుకు ఈ నెలంతా ఆధ్యాత్మికత ఆనందకరమైన వాతావరణమే.. కార్తీక మాసం వచ్చిందంటే ఆ సందడే వేరు.. ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగి తేలాల్సిందే.. ఆ శివయ్యను కనులారా చూడాల్సిందే.. దీనికి ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదు.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడా లేనన్ని ప్రధాన శైవ క్షేత్రాలు ఉన్నాయి.. ఒక పక్క పంచారామ క్షేత్రాలు.. సామర్లకోట కుమారరామ.. ద్రాక్షారామ భీమేశ్వరుడు.. మరోపక్క పాదగయ.. ఇంకో పక్క ఏకాదశ రుద్రులు ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎన్నెన్నో ప్రముఖ ఆలయాలు ఉన్నాయి.. కార్తీకం అంటే హరిహరులకు ఎంతో ప్రీతికరం.. ఈ మాసంలో అన్నవరంలో చేసే గిరి ప్రదక్షిణ ప్రత్యేకమే.. కార్తీక దీపాలు వదిలేందుకు వచ్చే భక్తులతో గోదావరి ఘాట్లు కళకళలాడతాయి. హరోం..హర.. హరహర మహాదేవ శంభో శంకర.. నినాదాలతో మారుమ్రోగుతాయి.. ఈ క్షేత్రాలన్నీ చూడగలమా అంటారా.. ఎందుకు చూడలేరు.. ఆర్టీసీ నుంచి ప్రత్యేక దర్శనయాత్రలు ఉన్నాయి.. ఇక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని శైవక్షేత్రాలకు బస్సులు ఏర్పాటు చేశారు.. ఇంతేనా అంటే.. ఇక కుటుంబీకులతో సరదాగా గడిపే వన భోజనాలకు ఈ మాసమే అనుకూలం.. అందుకే ఈ నెలంతా ఆధ్యాత్మికం.. ఆనందం..

నెలంతా.. ఆకాశదీపం

అన్నవరం/సామర్లకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాస ప్రారంభసూచికగా శుక్రవారం రాత్రి పాడ్యమి తిథి తగలడంతో సత్యదేవుడి సన్నిధిలో ఆకాశదీపం ఏర్పాటుచేశారు. అనివేటి మండపంలో ప్రత్యేక పూజలు చేసి నలుదిక్కులా దర్శించేలా నాలుగు దీపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక తాళ్లతో ధ్వజస్తంభం పైభాగంలో ఏర్పాటుచేశారు. అదే విధంగా సామర్లకోట కుమారరామంలో కూడా ఆకాశదీపం ఏర్పాటుచేశారు. కార్తీక మాసం నెలరోజులూ ఈ ఆకాశదీపం వెలుగుతూ ఉంటుంది. భక్తులు ఆకాశదీపం దర్శించుకుంటే జీవితంలో చీకట్లు తొలగి ఆయురారోగ్యాలతో ఉంటారని పండితులు పేర్కొన్నారు.

దీపావళి రోజు.. దారుణం!





రక్తపుమడుగులో బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్ మృతదేహాలు

దీపావళిరోజు దారుణం జరిగింది. ప్రశాంతతకు నిలయంగా ఉండే ఆ పల్లెటూరు ఒక్కసారిగా రక్తంతో తడిచింది. రెండు కుటుంబాల మధ్య మాటల యుద్ధం.. పరిధి దాటి పొడుచుకుని, నరుక్కునే స్థాయికి వెళ్లిపోయింది. విచక్షణా రహితమైన దాడి జరిగింది. దీని పర్యావసానంగా ఒక కుటుంబంలోని ముగ్గురు మరణించగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక గ్రామం ఈ దారుణమైన ఘటనకు వేదికగా మారింది.

- కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో ముగ్గురు దారుణ హత్య
- గ్రామస్తులను వణికించిన హత్యోదంతం
- కత్తులతో నరికి.. గునపాలతో పొడిచి రాడ్లతో విచక్షణారహితంగా దాడి
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు
- దారుణంగా హత్య చేసి మృతదేహాలను బైక్‌లతో తొక్కించిన నిందితులు
- హత్యలకు పాల్పడింది ఇంటి ఎదురుగా ఉన్న మరో కుటుంబమే
- ఐదుగురు నిందితుల్లో పోలీసుల అదుపులో ముగ్గురు

పాతకక్షలు, అక్రమ సంబంధ వివాదం నేపథ్యంలో ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణహత్యకు గురయ్యారు. హత్య సమయంలో నిందితులు ఈ ముగ్గురినీ కత్తులతో నరికి, గునపాలతో విచక్షణా రహితంగా పొడిచి చంపేశారు. ఒకరి తలనైతే పూర్తిగా తెగనరికారు. ఆనక మృతదేహాలను ద్విచక్ర వాహనాలు ఎక్కి తొక్కించారు. అంతేకాదు ముగ్గురినీ చంపేశాం.. ఇంకా ఎవరొస్తారో రండి అంటూ నిందితులు అరుపులు, కేకలతో బెంబేలెత్తించారు. ఆ తర్వాత నరికేసిన కత్తులను మృతుల చేతుల్లో ఉంచి పరారయ్యారు. దీపావళి అమావాస్య రోజైన గురువారం రాత్రి జరిగిన హత్యోదంతం తీవ్ర కలకలం రేపింది. కాజులూరు మండలం శలపాకలో ఎదురెదురు ఇళ్లల్లో ఉంటున్న రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న పాతకక్షలు చివరకు దారుణ హత్య ఘటనతో అందరినీ భీతిల్లేలా చేశాయి. ఘటనలో నిందితులుగా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని గుర్తించిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

- పూర్తి వివరాలు 5వ పేజీలో...

అట్టహాసంగా..



ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే ఆనందరావు, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్.. తొలి లబ్ధిదారుని ఇంట్లో టీ పెట్టించిన మంత్రి, కలెక్టర్



- ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని పేరూరులో ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే
- జిల్లాలో 5.47 లక్షల మందికి చేకూరనున్న లబ్ధి
- ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు
- హాజరైన కలెక్టర్, జేసీ

అమలాపురం,నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న సూపర్-6 హామీల్లో భాగంగా దీపం-2 పథకాన్ని శుక్రవారం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రారంభమైంది. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేరూరు హెచ్‌పీ గోడౌన్ వద్ద దీపం-2 ఉచిత గ్యాస్ పథకాన్ని లాంచనంగా జిల్లా అధికారుల సమక్షంలో ప్రారంభించారు. దీంతో ఏడాదికి మూడు సిలిండర్లు ఈ పథకం కింద లబ్ధిదారులకు ఉచితంగా అందనున్నాయి. జిల్లాలో 5.47 లక్షల మంది లబ్ధిదారులకు దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్ల ద్వారా లబ్ధి చేకూరనుంది. జిల్లావ్యాప్తంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ పథకాన్ని ప్రారంభించగా మిగిలిన జిల్లా కేంద్రాల్లో జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో ప్రారంభమైంది. అమలాపురంలోని శ్రీదేవి గ్యాస్ ఏజెన్సీలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఉచిత గ్యాస్ సిలిండర్‌ను లబ్ధిదారునికి అందజేశారు. వైపుఖ్య దుర్గాదేవి ఇంటి వద్ద దీపం-2 పథకాన్ని మంత్రి గ్యాస్ పొయ్యి వెలిగించి ప్రారంభించి టీ పెట్టించారు. ఉచిత సిలిండర్ల పంపిణీపై లబ్ధిదారులకు ప్రత్యేక అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 5.47 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, వచ్చే మార్చి 31 వరకు మొదటి సిలిండర్ బుకింగ్‌కు అవకాశం ఉందని తెలిపారు. సాధారణ పద్ధతిలోనే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని సిలిండర్ వచ్చిన తరువాత లబ్ధిదారుడు సొమ్ములు చెల్లించాలని ఆ తరువాత పట్టణ వాసులకైతే 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల వారికైతే 48 గంటల్లోగా ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ అమౌంట్‌ను జమ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ మాట్లాడుతూ తెల్లరేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులకు ఆర్థికభారం తగ్గించాలనే సంకల్పంతో ప్రభుత్వం మూడు సిలిండర్లను ఉచితంగా అర్హులైన పేదవారికి అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ గతంలో ధనిక వర్గాల వారికి మాత్రమే ఉండే గ్యాస్ సిలిండర్లు పేద వారికి చేర్చడానికి సీఎం చంద్రబాబు దీపం పథకం ద్వారా చొరవ చూపిన విషయాన్ని గుర్తుచేశారు. డ్వాక్రా సంఘాలకు రుణ సదుపాయం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ మహిళలకు కట్టెల పొయ్యి నుంచి విముక్తి కలిగించి దీపం-2 పథకం కింద పేదలకు ఉచితంగా సిలిండర్లను అందించడానికి ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ అధికారి ఉదయభాస్కర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, అధికారి జయవెంకటలక్ష్మి, పెచ్చెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు. అయితే ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ వస్తున్నారని తెలియడంతో కొందరు టీడీపీ నాయకులు అసహనానికి గురయ్యారు. మంత్రి కోసం గంటల తరబడి వేచి ఉండాలా అంటూ కీలక నేత జిల్లా అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. అయితే కలెక్టర్ ఎమ్మెల్యే ఆనందరావుతో ముందుగా మాట్లాడించారు. ఆ తరువాత సిలిండర్ల పంపిణీ ప్రారంభానికి మంత్రి సుభాష్ హాజరుకావడంతో కొద్దిసేపటికే ఎమ్మెల్యే వెళ్లిపోయారు.

దళిత, రెల్లి యువకులపై దాడి.. 8 మందిపై అట్రాసిటీ కేసు



మండపేట పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనచేస్తున్న దళిత సంఘాల నాయకులు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



గాయపడ్డ దళిత యువకులను పరామర్శిస్తున్న హర్షకుమార్

మండపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలోని సినిమా హాలు వద్ద ఒక వర్గానికి చెందిన ఒక యువకుడికి చెందిన బైక్‌ను ఆనుకుని కూర్చున్న యువతి వల్ల వ్యక్తి బైక్ పడిపోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈ వివాదం రెండు సామాజికవర్గాల మధ్య కొట్లాటకు దారితీయడంతో మండపేట అట్టుడికింది. బాధితుల కథనం ప్రకారం మండపేట పట్టణానికి చెందిన దళిత యువకులు, రెల్లికులస్థులు గురువారం పట్టణంలోని ఓ థియేటర్‌లో మ్యాట్నీ సినిమా చూసేందుకు వెళ్లారు. అదే సమయంలో అక్కడ ఏడిదకు చెందిన వ్యక్తి బైక్‌పై సినిమాకు వెళ్లిన రెల్లి సామాజిక వర్గానికి చెందిన కిరణ్ తన సోదరితో వెళ్లాడు. సోదరి జారబడడంతో ఆ బైక్ పడిపోయింది. దాంతో బైక్ కొంతమేర దెబ్బతినడంతో పడిపోయిన బైక్‌ను పైకిలేపి పెట్టేసి కిరణ్ అతడి మిత్రబృందం సినిమాకు వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత బైక్ యజమాని అతడి స్నేహితులతో కలిసి వచ్చి బండిని చూసి ఎవరు బండి పడగొట్టారంటూ థియేటర్‌లోకి వెళ్లి వీరంగం చేశారు. కిరణ్ తన సోదరి బండిపై జరపడడం వల్ల బైక్ పడిపోయిందని, జరిగిన నష్టం భరించి బాగు చేయించి ఇస్తామని చెప్పినా యువకులు వినలేదు. బైక్‌గల యువకుడికి కిరణ్‌తోపాటు అతడి మిత్రులు పాలపర్తి చంద్రశేఖర్, కొల్లి చంటి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకుండా యువకులు ముగ్గురు దళిత యువకులపై విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచారు. అదే సమయంలో కిరణ్ దాడికి భయపడి ప్రాణభయంతో పారిపోగా, పాలపర్తి చంద్రశేఖర్, కొల్లిచంటిలను అగ్రవర్ణ యువకులు తమ గ్రామం ఏడిదకు తీసుకుని వెళ్లి అక్కడ 40 మంది వరకు దాడికి పాల్పడ్డారని బాధితులు చెప్పారు. కులదూషణకు పాల్పడడంతోపాటు విచక్షణా రహితంగా దళిత యువకులపై అగ్రవర్ణానికి చెందిన యువకులు దాడికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. దాడి సంఘటన గురించి మండపేట పట్టణంలోని దళిత సంఘాల నేతలకు తెలియడంతో వారంతా బాధితులకు న్యాయం చేయాలంటూ గురువారంరాత్రి మండపేట పట్టణ పోలీసుస్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. దళిత సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకుడు దూళి జయరాజు, మాలమహానాడు నాయకుడు వెంటపల్లి జాన్‌మార్క్, రెల్లికుల సంఘ నాయకులు ఆందోళనకుదిగి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని స్టేషన్‌ముందు బైఠాయించారు. స్టేషన్ వద్ద ఆందోళన నేపథ్యంలో మండపేట రూరల్ సీఐ దొర్రాజు, స్టేషన్ ఎస్‌ఐ హరికోటిశాస్త్రి ఆందోళనకారులతో జరిపిన చర్చలు ఫలించకపోవడంతో రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ మండపేట చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండపేటకు చెందిన దళిత యువకులపై దాడికి పాల్పడిన ఏడిదకు చెందిన యువకులు 8 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశామని మండపేట రూరల్ సీఐ దొర్రాజు శుక్రవారం తెలిపారు. కాగా దళిత యువకులపై జరిగిన దాడిలో వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. ఆయన బాధితులను పరామర్శించారు. అలాగే మాజీ ఎంపీ హర్షకుమార్ కూడా బాధితులను కలిసి పరామర్శించారు. ఎమ్మార్పీఎస్ కన్వీనర్ సుబ్బారావు మాదిగ, జిల్లా సీఐటీయూ నాయకురాలు కె.కృష్ణవేణి శుక్రవారం బాధితులను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



నాగుల్లంక సర్వర్‌డౌన్‌తో సిబ్బంది పాట్లు

94.11 శాతం పింఛన్ల పంపిణీ

ఉదయం సర్వర్ డౌన్‌తో తిప్పలు

రాత్రికి వేగంగా అందజేత

పి.గన్నవరం,నవంబరు1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల సాయం లేకుండానే ఒకేరోజులో పింఛన్ల పంపిణీని విజయవంతంగా పూర్తిచేస్తోంది. తెల్లావారుజాము నుండే పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎప్పటిలాగే శుక్రవారం ఒకటవ తేదీ కావడంతో సిబ్బంది ఉదయాన్నే పింఛన్లు పంపిణీని ప్రారంభించారు. రెండు గంటలపాటు సజావుగానే సాగింది. అక్కడ నుంచి సర్వర్‌డౌన్ కావడంతో పింఛన్ల పంపిణీకి బ్రేక్‌పడింది. సర్వర్‌డౌన్, నెట్‌సిగ్నల్ లేకపోవడంతో సిబ్బంది నానావస్థలు పడ్డారు. ఈ విషయం తెలియక లబ్ధిదారులు సచివాలయాలు, పంచాయతీల చుట్టూ తిరగడంతోపాటు సంబంధిత సిబ్బందికి ఫోన్‌లు చేసి పింఛన్ల కోసం ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య ఉత్పన్నమైనట్టు అధికారులు గుర్తించారు. దీంతో ఉదయం పది గంటలు వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,39,368 పింఛన్లకుగాను 46.95 శాతం మాత్రమే పంపిణీ జరిగింది. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సర్వర్ తిరిగి పనిచేయడంతో సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. సాయంత్రం నుంచి రాత్రికి 2,25,161 మందికి పింఛన్లు పంపిణీచేసి 94.11 శాతం లక్ష్యాన్ని చేరారు. మిగిలినవి శనివారం అందజేస్తారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల తొలగింపుపై ఉద్రిక్తత





అధ్యాపకులకు నోటీసు అందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆనందమోహన్.. ఆందోళనలో పాల్గొన్న రాపాక

మలికిపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఆమరణదీక్షకు సిద్ధమవ్వడంతో మలికపురం కళాశాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గత 52 రోజుల నుంచి జీతాలకోసం అధ్యాపకులు సమ్మె చేస్తుండగా యాజమాన్యం దీపావళి ముందు రోజున అధ్యాపకుల అక్కౌంట్లలోకి నాలుగు నెలల జీతంవేసి వారిని తొలగించే దిశగా చర్యలు చేపట్టారు. అధ్యాపకులు తమ జీతాలు చెల్లించడంతో తరగతులకు హాజరవుతామంటూ కళాశాలలోకి రావడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డగించారు. కళాశాలలో తాత్కాలిక సిబ్బందితో పాఠాలు చెప్పిస్తున్నారని, ఇప్పుడు మీరు వస్తే సమస్యలు ఏర్పడతాయి, రావడం కుదరదని నిలిపివేశారు. దీంతో రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో వందలాది మంది కళాశాల వద్దకు చేరారు. ఒక దశలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు 24 మందినీ కళాశాల ప్రాంగణంలోకి అనుమతించి పోలీసులు ప్రిన్సిపాల్‌తో చర్చించారు. కరస్పాండెంట్ ఈ సమావేశానికి రాలేదు. కావాలనే కరస్పాండెంట్ రాలేదని ఆరోపించారు. తాము ఏమైనా సరే క్లాస్‌లకు వెళతామని అధ్యాపకులు ప్రిన్సిపాల్‌తో వాదనకు దిగారు. మనస్తాపం చెందిన ప్రిన్సిపాల్ తోరం సతీష్ యాజమాన్యాన్ని కాదని తానేమీ చేయలేనని, తాను కూడా తన ఉద్యోగానికి రాజీనామా చేసి బయటికి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ దశలో ప్రిన్సిపాల్ కరస్పాండెంట్‌తో సంప్రదించి 24 మంది అధ్యాపకులు తమకు అవసరం లేదని, అవసరం ఉన్నప్పుడు పిలుస్తామని నోటీసు ఇచ్చారు. ప్రిన్సిపాల్ పేరున ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నోటీసు ఇవ్వడం చెల్లదని అధ్యాపకులు నోటీసు తీసుకోలేదు.



కోటికాంతుల దీపావళి

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుల మతాలకు అతీతంగా గురువారం రాత్రి కోటికాంతుల దీపావళిని పండుగలా జరుపుకున్నారు. తొలుత మహాలక్ష్మీపూజను ఇంటింటా నిర్వహించారు. అనంతరం పిల్లాపాపలతో కలసి వయోబేధాన్ని మరచిపోయి ఆనందోత్సాహాలతో బాణసంచా కాల్చారు. అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో ఎటుచూసినా టపాసుల మోతే. ఆకాశం జిగేల్‌మనే వెలుగులతో నిండిపోయాయి. అమలాపురంలోని పలు అపార్టుమెంట్ల వద్ద సామూహికంగా లక్ష్మీపూజలు నిర్వహించి దీపావళి పండుగను వేడుకగా జరుపుకున్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో సపక్‌తక్రా క్రీడాకారులు నిత్యం సాధన చేసే క్రీడా ప్రాంగణాన్ని క్రీడా జ్యోతులతో అలంకరించి దీపావళి వేడుకలు నిర్వహించారు. కోచ్ యాండ్ర గౌతమ్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు.

కార్తీకమాసం ఆరంభం. ఈనెలంతా ఒక ఆధ్యాత్మిక యాత్రలా సాగుతుంది. సూర్యోదయంలోపు స్నానాలు.. పూజలు... అభిషేకాలు.. దీపారాధనలు, ఉపవాసాలు.. ఎక్కడ చూసినా భక్తి కార్యక్రమాలే కనిపిస్తాయి. మరోవైపు మాలధారణలు, అనేక సంప్రదాయాలు ఆధ్యాత్మికతకు అద్దంపడతాయి. హైటెక్ కాలంలోనూ భక్తజనం క్రమం తప్పకుండా పాటిస్తున్న ఆచార వ్యవహారాలు మరోవైపు. వనభోజనాల సందడి ఇంకోవైపు. శివకేశవులకు ప్రీతికరమైన మాసం కావడంతో దాదాపుగా అన్ని ఆలయాల్లో పూజాదికాలు నిర్వహిస్తారు. నోములు, కార్తీక పౌర్ణమి పర్వదినాల జ్వాలాతోరణం తదితర విశేష కార్యక్రమాలు సరేసరి. అటు మంచుతో కూడిన చల్లని వాతావరణం, మదిని దోచే ప్రకృతి రమణీయత.. ఇటు ఆధ్యాత్మిక తన్మయం కలగలిసిన ఈ కాలానికి శుభోదయం..

పదండి.. కార్తీకం లోకి..


ద్రాక్షారామ భీమేశ్వరాలయం

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- పంచారామ క్షేత్రాలు ముస్తాబు
- అన్ని హరిహర క్షేత్రాల్లోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- మాలధారణలతో భక్తి పారవశ్యం
- వనభోజనాల సందడే సందడి
- పంచారామాలు, ఏకాదశ రుద్రుల దర్శన యాత్రలకు ప్రత్యేక ఏర్పాట్లు

పంచారామాలు.. సామర్లకోట, ద్రాక్షారామ ముస్తాబు

ద్రాక్షారామ/సామర్లకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మహోత్సవాలకు పంచారామ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. ఇందులో ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం ఇప్పటికే ముస్తాబైంది. స్వయంభువు అయిన భీమేశ్వరస్వామివారు, అష్టాదశ శక్తి పీఠాల్లో ద్వాదశశక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలో ఇతర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిత్యం చేస్తుంటారు. ఈ మేరకు భీమేశ్వరాలయంలో స్వామివారి దర్శనానికి ఆలయ సహాయ కమిషనరు ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామివారిదర్శనం, అభిషేకాలు ప్రారంభం అవుతాయి. రాత్రి భక్తులు రాకను బట్టి దర్శనం గడువు 12 గంటల వరకు ఉంటుంది. ఇక సామర్లకోట భీమేశ్వరాలయం కార్తీక మాసోత్సవాలకు సిద్ధమైంది. శుక్రవారం రాత్రి వేదపండితులు ఆలయ ధ్వజస్తంభం వద్ద వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆకాశదీప పూజలను ఘనంగా ప్రారంభించారు. శనివారం తెల్లవారుజాము నుంచి తొలి అభిషేక పూజలతో కార్తీక మాసం సంపూర్తిగా ప్రారంభవుతుందని కుమారరామ భీమేశ్వరాలయం అభిషేక పండిట్ వేమూరి సోమేశ్వరశర్మ తెలిపారు.


సామర్లకోట కుమారరామ భీమేశ్వరుడు

వనభోజనంతో పాప విముక్తి..

కార్తీక మాసంలో వనభోజనాలు అధికంగా ఉసిరిచెట్టు కింద సమారాధన చేసి బంధువులు, మిత్రులతో భోజనం చేస్తే ఎంతో మంచి జరుగుతుందని.. ఉసరిక ఉన్న వనంలో భోజనంచేస్తే పాప విముక్తులై విష్ణు లోకానికి వెళ్తారని అనేది భక్తుల నమ్మకం. ఈ మాసంలో తెల్లవారుజామున మహిళలు తెల్లవారుజామునే నిద్రలేవడం, పసుపు రాసుకోవడం, చల్లని నీటితో స్నానం చేయడం, తులసి మొక్కకు నీళ్ల పోసి చుట్టూ ప్రదక్షిణలు చేయడంలాంటివి ఇందుకు ఉపయోగపడతాయి. అల్పాహారం, మధ్యాహ్నం మిత భోజనం, రాత్రికి పండ్లు, పాలు వంటివి తీసుకోవడం, సమష్టిగా వనభోజనాలు చేయడం, ప్రకృతి ఒడిలో సేదతీరడం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.


క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరంలో 'గిరిప్రదక్షిణ'

అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకం అంటే హరిహరులకు ఎంతో ప్రీతికరం. హరిహరక్షేత్రంగా భక్తకోటి నీరాజనాలు అందుకుంటున్న అన్నవరం పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం పురస్కరించుకుని సుమారు 15 లక్షల మంది భక్తులు స్వామివారి సన్నిధికి విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుంటారు. 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయి. కార్తీకమాసంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణ జరగనుండగా 1.30 లక్షల మంది పాల్గొంటారు. స్వామివారి తెప్పోత్సవానికి 50 వేలమంది విచ్చేస్తారు. దీంతో ఆలయ అధికారులు భక్తుల సౌకర్యాల కల్పనకు రూ.2 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో సిట్టింగ్, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. రూ.17.50 లక్షలతో ప్రస్తుతం ఉన్న క్యూలైన్‌కు అదనంగా 100 అడుగులు పొడవుతో రెండు వరసల్లో అదనంగా మరో 1200మందికి వీలుగా ఈ క్యూలైన్‌ను నిర్మించినట్టు ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. పాడైన ఘాట్‌రోడ్డులో బీటీ రోడ్డుకు రూ.40 లక్షల వ్యయం చేశారు. రూ.12.50 లక్షలతో భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణగా వాటర్‌ప్రూఫ్ షామియానాలు సిద్ధంగా ఉంచారు. రూ.39లక్షలతో వివిధ సత్రం గదుల్లో పాడైన పరుపులు, మంచాలు పిల్లోస్ కొత్తవి ఏర్పాటుచేశారు. రూ.3.50 లక్షలతో ప్రకాశ్‌సదన్ వెనుక, వనదుర్గ ఆలయం, గిరిప్రదక్షిణ మార్గాల్లో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, రత్నగిరినుంచి సత్యగిరి కొండకు రూ.15లక్షలతో మెట్ల మార్గం ఏర్పాటు రూ.5లక్షల వ్యయంతో తెప్పోత్సవం రోజున హంసవాహనం తీర్చిదిద్దేందుకు, రూ.9.50 లక్షలతో అదనపు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. గిరిప్రదక్షిణ రోజున రూ.3 లక్షలతో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. సీఆర్వో కార్యాలయం ఎదురుగా 1000మంది బసచేసేందుకు వీలుగా ఉచిత డార్మెటరీ, లాకర్లను సిద్ధంగా ఉంచినట్టు ఈవో తెలిపారు. కార్తీకమాసంలో 14 రోజులు పర్వదినాలుగా గుర్తించగా, ఆయా రోజుల్లో ఒంటి గంట నుంచి వ్రతాలు రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తామని ఈవో తెలిపారు.

పర్వదినాలకు నెలవు!

అమలాపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శివకేశవులకు బేధం లేదని చెప్పే కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభమవుతుంది. శివకేశవులకు ప్రీతిదాయకమైన మాసంగా చెబుతారు. ఈనెల 2 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తీకమాసమని బండారులంకకు చెందిన ప్రముఖ పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు. కార్తీకమాసంలో శివుడిని, విష్ణువును ఆరాధిస్తారు. మాసాధిపతి అయిన దామోదరుని పూజించి కేదారేశ్వరుని వ్రతం చేసుకోవడంతోపాటు చిలుకు ద్వాదశి నాడు సాలగ్రామం దానం చేయడం విశేష పుణ్య ఫలితమని చెప్పారు. ఈనెలలో 4, 11, 18, 25 తేదీలు కార్తీక సోమవారం రోజున శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. 15న కార్తీక పౌర్ణమి జరుపుకుంటారు. అట్లతద్ది వాయనాలు తీర్చుకోనివారు కార్తీక సోమవారం, పౌర్ణమి తిథిలో తద్ది వాయనాలు తీర్చుకున్న తరువాత నోము పట్టవచ్చు. ఈనెల 2న భగినీ హస్త భోజనం, 5న నాగుల చవితి, 8న యాజ్ఞవల్క్య మహర్షి జయంతి, 9న గోపాష్టమి, 12న బోధన ఏకాదశి, 13న చిలుకుద్వాదశి-క్షీరాబ్ధిపూజ, 14న వైకుంఠ చతుర్దశి, 15న కార్తీక పౌర్ణమి-జ్వాలాతోరణం, 18న సంకష్టహరచతుర్థి, 23న సత్యసాయిబాబా జన్మదినం, 29న మాసశివరాత్రి, డిసెంబరు 1 అమావాస్యతో కార్తీకమాసం పూర్తవుతుంది. ఈమాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాలకు అనంతమైన పుణ్యఫలితాలు కలగచేస్తాయని కార్తీక పురాణం చెబుతోంది.

వివాహాది శుభ ముహూర్తాలు..

కార్తీకమాసంలో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడతాయి. అదేవిధంగా వివాహాది శుభ ముహూర్తాలు కూడా మెండుగా ఉన్నాయి. ఈ నెలలో 3, 6, 9, 10, 13, 14, 22 తేదీల్లో వివాహాలకు ముహూర్తాలు ఉన్నాయి. ఇక 4, 10, 11, 13, 14, 17, 20, 24 తేదీల్లో శంకుస్థాపనలు, 3, 4, 9, 10, 11, 13, 17, 20, 24, 25 తేదీల్లో గృహ ప్రవేశాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయని భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

దీపారాధన...

శివనామస్మరణ చేస్తూ ఒత్తులను తయారు చేసి రోజుకు ఒకటి చొప్పున మొత్తంగా 365 ఒత్తులతో శివునికి దీపారాధన జరిపితే పుణ్యం లభిస్తుందని శాస్త్రం చెబుతోంది. ఈ మాసంలో ఐదు రోజుల్లో ఏకాదశి నాడు ఉపవాసం, ద్వాదశి నాడు తులసీ వివాహం, వైకుంఠ చతుర్దశినాడు ఉసిరి చెట్టుకింద దీపరాధన చేస్తారు. కార్తీక పౌర్ణమి నాడు 365 ఒత్తులతో దీపారాధన చేస్తారు. విష్ణుమూర్తికి ఇష్టమైన పౌర్ణమి రోజున స్నానాలు ఆచరించి సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తారు.

ఏకాదశ రుద్రుల దర్శనయాత్ర

అంబాజీపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏకాదశ రుద్రుల శైవక్షేత్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో కార్తీకమాసం సందర్భంగా భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. 450 శతాబ్దాల చరిత్ర కలిగిన జగన్నతోట ప్రభల ఉత్సవానికి 2020లో ప్రధాని మోదీ ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలంటూ అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంనకు చెందిన శివకేశయూత్ సభ్యులకు లేఖను రాశారు. అలాగే శృంగేరీ పీఠాధిపతి ఏకాదశ రుద్రులపై లేఖను అందించారు. ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన 74వ రిపబ్లిక్ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకాదశ రుద్రు ప్రభల శకటం వెళ్లడంతో జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించింది. దీంతో కార్తీకమాసం సందర్భంగా ఏకాదశ రుద్రుల దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఏకాదశ రుద్రులు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో కొలువై ఉన్నారు. అంబాజీపేట మండలంలో సుమారు 9 గ్రామాలుండగా అయినవిల్లి, అమలాపురం మండలాలలో నేదునూరు, పాలగుమ్మి గ్రామాలున్నాయి. కార్తీకమాసంతోపాటు ఇతర రోజుల్లో ఏకాదశ రుద్రులను ఒకేరోజు దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని పండితులు చెబుతారు. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి(తికాగ్ని కాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి(కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేశ్వరస్వామి(త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి(నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు(మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి (సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని చెబుతున్నారు.



కొవ్వూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు

ఏకాదశ రుద్రుల దర్శనం కోసం కొవ్వూరు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. గతేడాది కూడా కొవ్వూరు డిపో నుంచి 100 బస్సుల వరకు రావడంతో ఈ ఏడాది దర్శనాల కోసం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దర్శనాల కోసం సోషల్‌మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అల్పాహారం, విందు ఏర్పాటుచేసేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులను కొవ్వూరు డిపో నుంచి వస్తాయి.

రాజమహేంద్రిలో ఘాట్లన్నీ రెడీ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో గోదావరి జిల్లాల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో కార్తీక స్నానమాచరిస్తారు. రాజమహేంద్రవరంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను నగరపాలక సంస్థ పూర్తిచేశారు. పవిత్రగోదావరి నదీలో కార్తీ స్నానాలచరించే భక్తుల కోసం పది రేవులను సిద్ధం చేశారు. రేవులను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లి రేవుల్లో నీటిలో ఉన్న నాచు, ఇతర వ్యర్థాలను తీసివేశారు. రాజమహేంద్రవరంలో కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, మార్కండేయఘాట్, శ్రద్ధానంద ఘాట్, పిండాలరేవు, సరస్వతి ఘాట్, గౌతమిఘాట్ తదితర రేవులను భక్తుల స్నానాలకు సిద్ధంచేశారు. రాజమహేంద్రవరం, రూరల్ పరిధిలో ఉన్న 11 రేవులలో పది రేవులు మాత్రమే స్నానాలకు అనుకూలంగా ఉంటాయి వాటిని రెడీచేశారు. రాజమహేంద్రవరంలో స్నానాల రేవుల్లో పనిచేయడానికి నగర పాలక సంస్థ పారిశుద్ధ్యవిభాగంలో అదనంగా 90 మంది కార్మికులను ఏర్పాటుచేశారు. నగర పాలకసంస్థ రెగ్యులర్ కార్మికులతోపాటు అదనంగా వీరు పనిచేస్తారు. రేవులో రెండు షిఫ్టుల విదానంలో కార్మికులు పనిచేస్తారని శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ తెలిపారు.


ఘాట్ల వద్ద సిద్ధమైన దుస్తులు మార్చుకునే గదులు

పాదగయ.. ముస్తాబు

పిఠాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రానికి కార్తీకమాసం నెలరోజులపాటు భక్తులు పోటెత్తుతారు. సోమవారాలు, ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి పర్వదినాల్లో ఈ రద్దీ మరింత అధికంగా ఉంటుంది. కార్తీకమాసం తొలిరోజు శనివారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి పాడ్యమి దీపాలు వెలిగించడం ద్వారా కార్తీకమాస నోములను భక్తులు ప్రారంభానికి నాంది పలికారు.ఇళ్లవద్ద, ఆలయాల్లో పూజల్లో చేసే భక్తులంతా పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడం సంప్రదాయం వస్తోంది. నెల రోజులపాటు పాదగయక్షేత్రంలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. ప్రతి నిత్యం స్వయంభూ లింగ మూర్తి అయిన కుక్కుటేశునికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్టాన దేవతైన పురుహూతికాఅమ్మవారికి, రాజరాజేశ్వరీదేవికి కుంకుమ పూజలు జరుగుతాయి. ఈనెల రోజులూ శనివారం నుంచి డిసెంబరు 1 వరకూ ప్రతి రోజూ తెల్లవారుజామున 4గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఆలయం తెరిచి ఉంటుందని ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలియజేశారు.



వాడపల్లిలో నరకాసుర వధ

- ఆలయంలో భక్తుల సందడి
- ఆకట్టుకున్న బాణసంచా కాల్పులు


వాడపల్లి వెంకన్న ఆలయంలో నరకాసుర వధ జరుపుతున్న దృశ్యం


వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారి పల్లకి మహోత్సవం

ఆత్రేయపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి నరక చతుర్దశి సందర్భంగా నరకాసుర వధ జరిపారు. నరకాసుర బొమ్మకు నిప్పు పెట్టి దహనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి పల్లకి మహోత్సవం కన్నుల పండువగా జరిపారు. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పండుగలను నిర్వహించారు. బాణసంచా కాల్చి ఆనందోత్సాహాల మధ్య దీపావళిని జరిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1.01 లక్షల విరాళం

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన కర్రి చిన్నభద్రా రెడ్డి, శైలజ దంపతులు రూ.1,01,116 విరాళం అందించారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,32,461 లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నేడు టీఎన్ఏఐ రాష్ట్ర సమావేశం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(టీఎన్ఏఐ) రాష్ట్రశాఖ ద్వైవార్షిక సమావేశం శనివారం కాకినాడలో జరగనుంది. అసోసియేషన్ కార్యదర్శి ప్రొఫెసర్ కె.సుశీల మాట్లాడుతూ వివేకానంద పార్క్ సమీపంలోని హోటల్‌లో సదస్సు జరగనుందని, ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో వక్తల ప్రసంగాలతోపాటు సైంటిఫిక్ పేపర్ల ప్రజెంటేషన్, ఇన్నోవేషన్స్ ఇన్ నర్సింగ్ ప్రాక్టీస్, ఇంపాక్ట్ ఆఫ్ నర్సింగ్ లీడర్స్ తదితర అంశాలపై ప్లీనరీ సెషన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా 2400 మంది నర్సులు హాజరుకానున్నట్లు సుశీల తెలిపారు.

అప్రెంటీస్ శిక్షణకు 8న రాత పరీక్ష

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర పేపర్ మిల్స్‌లో అప్రెంటీస్ శిక్షణ కోసం ఐటీఐ అభ్యర్థులకు ఈ నెల 8న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ క్రిష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడుల్లో సుమారు 150 ఖాళీలు వున్నాయన్నారు. ఎంపికైన వారికి ఏడాది శిక్షణతోపాటు నెలకు సుమారు రూ.8,500 స్టైఫండ్ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అప్రెంటీస్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్, కాపీ, ఐటీఐ, పదో తరగతి సర్టిఫికెట్స్, పాన్ కార్డ్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు సీవోవో ఏర్పాటు


ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు మొట్టమొదటి సారిగా కల్చర్ ఆర్ఫన్ అవుట్‌రీచ్(సీవోవో) పేరుతో డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సీవోవో ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులతో శుక్రవారం ఆన్‌లైన్ సమావేశం జరిపారు. దీనికి వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ అతిథులుగా పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ ఈ డైరెక్టరేట్ దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలకు రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఇప్పటికే అనుబంధ కళాశాలల ద్వారా ఈ కేటగిరీ విద్యార్థుల వివరాలను సేకరించడంతోపాటు సీవోవో డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సీవోవో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అనుబంధ కళాశాలల విద్యార్థులను స్టూడెంట్ ప్రోగ్రామ్ ఎక్స్ఛేంజ్ కింద నేపాల్, తైవాన్‌లకు పంపిస్తామని, దానికి సీవోవో గ్రూపులోని విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థులైన ఐఏఎస్ అధికారులతో సీఆర్టీ తరగతులు, సివిల్స్ సాధనకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటివరకూ 41 మంది విద్యార్థుల వివరాలు పంపించారని వివరాలు అందజేయని విద్యార్థులు jntukcoo@gmail.com మెయిల్ ఐడీకి త్వరగా పంపించాలని డైరెక్టర్ సాయిబాబు సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులు

కాకినాడఅర్బన్, నవంబరు 1: ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారం డీఎస్ఏ ప్రాంగణంలో డీఎస్‌డీవో శ్రీనివాస కుమార్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 30 మంది హాజరవ్వగా 17 మందిని ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 9, 10 తేదీల్లో అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ కనకదుర్గ తెలిపారు. ఫ్రీస్టైల్ ఉమెన్ 50, 53, 57, 59, 65, 72, 76 కిలోల విభాగం, బాలుర ఫ్రీ స్టైల్ 65, 70, 74, 79 కిలోల విభాగం, గ్రీకు, రోమన్, బాలబాలికల 63, 67, 72, 77, 82 కిలోల విభాగాల్లో క్రీడాకారులు ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు ఎలీషాబాబు, కార్యదర్శి రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో...

శుక్రవారం నుంచి కార్తీకమాసం మొదలవడం, మరోవైపు రాత్రి 10 దాటితే చాలు మంచు దుప్పటి ముసుగేస్తున్నది. ఉదయం 6.30 దాటినా చలితో కూడిన పొగమంచే దర్శనమిస్తోంది. పంట పొలాలు, రహదారుల వెంట శుక్రవారం పొగమంచు ఇలా కమ్మేసింది.

మండపేట, ఆంధ్రజ్యోతి



పాదగయ క్షేత్రంలో

సమాచార కమిషనరు పూజలు

పిఠాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సమాచార కమిషనరు ఉయదభాస్కరరెడ్డి శుక్రవారం రాత్రి సందర్శించారు. సతీమణితో కలిసి కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఉదయభాస్కరరెడ్డి దంపతులను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.



డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

కోరుకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా జగన్నాథపురం పర్యటన కోసం శుక్రవారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి విమానంలో మధురపూడి చేరుకున్న ఆయనకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అలాగే కూటమి ముఖ్య నాయకులు, పలువురు జిల్లా స్థాయి అధికారులు పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక కాన్వాయ్‌లో జగన్నాథపురం వెళ్లారు.

దీపావళి రోజు దారుణం

- కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో ముగ్గురు దారుణ హత్య
- కత్తులతో నరికి.. గునపాలతో పొడిచి రాడ్లతో విచక్షణారహితంగా దాడి
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తింపు
- హత్యలకు పాల్పడింది ఇంటి ఎదురుగా ఉన్న మరో కుటుంబమే
- ఐదుగురు నిందితుల్లో పోలీసుల అదుపులో ముగ్గురు

కాకినాడ/కాజులూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక గ్రామం గురువారం రాత్రి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. దీపావళి రోజు రాత్రి అందరూ టపాసులు పేల్చి సంబరాల్లో ఉంటే గ్రామం మాత్రం కత్తుల కరాళ నృత్యంతో వణికిపోయింది. ముగ్గురి దారుణ హత్యతో భీతిల్లింది. కాజులూరు మండలం గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శలపాకలో గురువారం రాత్రి తొమ్మిది గంటలకు జరిగిన ఈ హత్యోదంతానికి సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలివి.

శలపాక గ్రామంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు ఎదురెదురు ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. చిన్నయ్య సోదరుడు రాజు, కుమారుడు రమేష్ ఒకే ఇంట్లో ఉంటున్నారు. చిన్నయ్య రాజు ఇద్దరి భార్యలు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. కాగా నాగేశ్వరరావు భార్య బేబీతో బత్తుల చిన్నయ్యకు వివాహేతర సంబంధం ఉందంటూ గ్రామంలో ప్రచారం జరుగుతోంది. నాగేశ్వరరావును ఉద్దేశించి నీ భార్యను నేను ఉంచుకున్నాను.. నువ్వు చేతకానివాడివిరా.. నువ్వేం చేస్తావు అంటూ నాగేశ్వరరావును తరచూ బత్తుల చిన్నయ్య కుటుంబం వేధిస్తున్నట్టు నాగేశ్వరరావు పలుసార్లు గ్రామపెద్దల దృష్టికి తీసుకువెళ్లాడు. పెద్దలు సర్దిచెప్పినా చిన్నయ్య, ఆయన కుటుంబం మాత్రం తరచూ నాగేశ్వరరావును భార్య విషయంలో సూటిపోటి మాటలతో వేధించేవారు. మూడు రోజుల కిందట కూడా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి బత్తుల కుటుంబం గొడవ చేసింది. దీంతో నాగేశ్వరరావు కుటుంబం కూడా బత్తుల కుటుంబంతో గొడవకు దిగి మాటమాట అనుకున్నారు. ఈ సమయంలో మళ్లీ చిన్నయ్య కుటుంబ సభ్యులు నాగేశ్వరరావును దూషిస్తూ హేళనగా మాట్లాడారు. ఆయన భార్య బేబీని బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు అసభ్యకర పదజాలంతో దూషించారు. మూడు రోజుల కిందట జరిగిన గొడవ సద్దుమణిగిందని అంతా అనుకున్నారు. కానీ గురువారం రాత్రి మళ్లీ రెండు కుటుంబాల మధ్య గొడవ పెరిగింది. ఈ క్రమంలో బత్తుల కుటుంబసభ్యులు నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి బూతులతో విరుచుకుపడ్డారు. దీంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న నాగేశ్వరరావు, ఆయన భార్య బేబీ, కుమారులు బత్తుల కుటుంబ వేధింపులు భరించలేక దాడికి దిగారు. ఇంట్లో ఉన్న కత్తులు, గునపాలు తెచ్చి బత్తుల చిన్నయ్య (42), బత్తుల రాజు (40), చిన్నయ్య కొడుకు బత్తుల రమేష్ (25), బంధువు బత్తుల శ్రీనుపై దాడికి దిగారు.

కరెంటు తీసేసి.. దారుణంగా చంపేసి..

గొడవకు ముందే పథకం ప్రకారం హత్యకు స్కెచ్ వేసినట్టు పోలీసులు చెప్తున్నారు. ఇందులో భాగంగా గొడవకు ముందు ఇంట్లో మారణాయుధాలు సిద్ధం చేయడం, మరో మనిషితో ఇంటి వద్ద విద్యుత్ దీపాలు ఆపేసి చీకటి ఉండేలా ప్లాన్ చేశారు. ఈ క్రమంలో బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్



శలపాకలో పోలీసు పహారా

గొడవ పడుతుండగా ఇంట్లోంచి నాగేశ్వరరావు, ఆయన భార్య బేబీ, ఇతర కుటుంబసభ్యులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, వినోద్ తదితరులు కత్తులు, గునపాలతో బత్తుల కుటుంబానికి చెందిన నలుగురిపై దాడికి దిగారు. కత్తులతో ఉదరం, ఛాతి, మెడపై నరికేశారు. గునపాలతోనూ విచక్షణారహితంగా పొడిచేశారు. మృతుల్లో ఇద్దరు పారిపోయే ప్రయత్నం చేయగా వెంటాడి వెంటాడి నరికేశారు. గునపాలతో పొడవడంతో బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్ ముగ్గురు రక్తపు మడుగులో విలవిల్లాడారు. అదే సమయంలో వీరు ముగ్గురినీ తలపైనా గునపాలతో పొడిచేశారు. వెంట ఉన్న ఇనుపరాడ్లతో తలపై బలంగా దాడి చేశారు. దీంతో ఇద్దరికి మెదడు బయటకు రాగా, కళ్లు ఛిద్రమైపోయాయి. మరొకరి తల పూర్తిగా వేరు పడిపోయింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. అనంతరం మృతదేహాలపైకి ద్విచక్రవాహనాలను ఎక్కించి మరింత నుజ్జునుజ్జు చేశారు. ఆ తర్వాత ఇంకా ఎవరొస్తారో రండి అంటూ నిందితులు అరుపులు, కేకలు వేశారు. చిమ్మచీకటి కావడంతో చుట్టుపక్కల ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాలేదు. అందరూ భయంగా ఇళ్లలోకి వెళ్లిపోయి తలుపులు వేసేసుకున్నారు. హత్య చేసిన తర్వాత నిందితులు తమ చేతుల్లోని కత్తులను మరణించిన వారి చేతుల్లో ఉంచి పరారయ్యారు. ఆ తర్వాత సమాచారం స్థానిక సర్పంచ్‌కు తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. దాడిలో గాయాలతో తప్పించుకున్న బత్తుల శ్రీనును కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

ఎస్పీ పరిశీలన

విషయం తెలిసిన కాకినాడ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సంఘటనాస్థలానికి వెళ్లి హత్య జరిగిన తీరును పరిశీలించారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కాగా హత్య ఘటనపై గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ... ఈ రెండు కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా ఘర్షణ జరుగుతోందన్నారు. నాగేశ్వరరావు భార్య బేబీని చనిపోయిన చిన్నయ్య తరచూ అసభ్య పదజాలంతో దూషిస్తుండడం హత్యకు కారణమని వివరించారు. నిందితులైన నాగేశ్వరరావు, బేబీ, సుబ్రహ్మణ్యంలను అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఒకరి తర్వాత ఒకరిని నరికేశారు

మా పెదనాన్నతో నాగేశ్వరరావు కుటుంబం గొడవపెట్టుకుంది. గొడవ సమయంలో నాగేశ్వరరావు, బేబీ మా పెదనాన్నపై కత్తులతో దాడి చేసి చంపేశారు. విషయం తెలిసి వారిని అడ్డుకోవడానికి వెళ్లిన రాజు, రమేష్‌లను కూడా దారుణంగా కత్తులతో నరికేసి గునపాలతో పొడిచేశారు. చనిపోయిన తర్వాత వారిపైకి ద్విచక్రవాహనాలు ఎక్కించి తొక్కించారు. మా వారిని విచక్షణారహితంగా నరికేశారు. కాపాడండి అంటూ వాళ్ల ఆర్తనాదాలు పెట్టారు. రాడ్లు, కత్తులతో ఎక్కడపడితే అక్కడ పొడిచేసి చంపేశారు. గొడవ గురించి తెలిసి వెళ్లిన నన్ను కూడా చంపేస్తామని బెదిరించారు.

-రాజశ్రీ, బత్తుల చిన్నయ్య బంధువు

ముగ్గురూ అక్కడే చనిపోయి కనిపించారు

నాగేశ్వరరావు కుటుంబసభ్యులు బత్తుల కుటుంబీకులను ముగ్గురినీ దారుణంగా హత్య చేసిన తర్వాత స్థానికులు నాకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే ఎస్ఐకు సమాచారం ఇచ్చాను. నేను సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా ముగ్గురూ అక్కడే చనిపోయి కనిపించారు.

-గనిరాజు, సర్పంచ్, శలపాక

మృత్యు శకటాలు

కాకినాడ జిల్లాలో గురు, శుక్రవారాల్లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. లారీలు వెనుక నుంచి ఢీకొనడంతోనే ఇవి చోటుచేసుకున్నాయి.

లారీ ఢీకొని

హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం



రామచంద్రరావు (పాత చిత్రం)

సర్పవరం జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ సర్పవరం జంక్షన్‌లో శుక్రవారం రాత్రి ఒక లారీ బీభత్సం సృష్టించింది. విధుల్లో వున్న హెడ్ కానిస్టేబుల్‌ను పొట్టనపెట్టుకుంది. కాకినాడ రూరల్ రమణయ్యపేట జనచైతన్య కాలనీకి చెందిన ముంగళ్ల రామచంద్రరావు (61) సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో (2688) హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ నుంచి బైక్‌పై సర్పవరం జంక్షన్ వైపు బయల్దేరాడు. ఈ సమయంలో అచ్చంపేట నుంచి సర్పవరం జంక్షన్ వైపు వెళ్తున్న లారీ వెనకాల నుంచి వచ్చి ఢీకొట్టింది. రామచంద్రరావు బైక్‌పై నుంచి రోడ్డుపై కుడి వైపు పడిపోవడంతో లారీ ఆయన శరీరంపై నుంచి వెళ్లిపోయింది. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పక్కనే పోలీస్‌స్టేషన్ ఉండటంతో సీఐ బి.పెద్దిరాజు సిబ్బందితో హుటాహుటీన వచ్చి ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. అప్పటికే మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్ వేగంగా వెనకాల నుంచి ఢీకొట్టడంతోనే రామచంద్రరావు మృతి చెందాడని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు విజయశేఖర్, కుమార్తె అరవిందదేవి ఉన్నారు. అప్పటిదాకా పోలీస్‌స్టేషన్‌లో ఉండి కేసు విషయమై తమతో మాట్లాడి బయటకెళ్లిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సహచర పోలీసులు తెలిపారు. మరో ఏడాదిలో ఉద్యోగ విరమణ చేస్తున్నానని, ప్రభుత్వం వయోపరిమితి పెంచకపోతే ఏడాది కిందటే రిటైరయ్యేవాడినని తరచూ తమతో అనేవారని వారు చెప్పారు.

షాపింగ్‌కు వెళ్లి తిరిగొస్తుండగా...

వెనుక నుంచి లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు గాయాలు



స్వర్ణలత (పాత చిత్రం)

గండేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో జగ్గంపేటకు చెందిన స్వర్ణలత (23) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్వర్ణలత భర్త సతీష్‌కుమార్‌తో కలిసి స్కూటీపై పండుగకు షాపింగ్ చేయడానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వెనుక నుంచి ఓ ట్యాంకర్ అతి వేగంతో వచ్చి వారి వాహనాన్ని ఢీకొంది. వెనుక కూర్చున్న స్వర్ణలత కింద పడిపోగా ఆమె తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సతీష్ కాలుకి గాయాలయ్యాయి. దీపావళి తమ ఇంట విషాదం మిగిల్చిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. స్వర్ణలతకు ఒక కుమార్తె ఉంది. విషయం తెలిసిన ఎస్ఐ శివ నాగబాబు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లైన రెండు నెలలకే...

- వివాహిత బలవన్మరణం
- పుట్టింటి పేరుతోనే అంత్యక్రియలు జరపాలని సూసైడ్ నోట్
- అత్తింటి వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు
- భర్త, అత్త, మామ అరెస్టు



ప్రత్యూష (పాత చిత్రం)

రాజమహేంద్రవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన రెండు నెలలకే ఓ వివాహిత బలవంతంగా ప్రాణాలు తీసుకుంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో దీపావళి రోజున జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి.... అమలకంటి వెంకట ప్రసాద్ కాంట్రాక్టరుగా జీవనం సాగిస్తూ రాజమహేంద్రవరం కంబాలచెరువు సమీపంలోని లోలుగు అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు ప్రత్యూష (26)కు ఆగస్టు 22న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కత్తి నాగ సత్య శ్రీనివాసరావు కుమారుడు వంశీ రాధాకృష్ణకు ఇచ్చి వివాహం జరిపించాడు. అతడు చెన్నైలోని చెన్నై పెట్రో కెమికల్స్ (సీపీసీఎల్) లిమిటెడ్ కంపెనీలో చార్టర్డ్ అక్కౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. పెళ్లయిన తర్వాత రెండు రోజులు ఇద్దరూ పాలకొల్లులో ఉన్నారు. తర్వాత అతడు చెన్నై వెళ్లిపోయాడు. అబ్బాయి తల్లిదండ్రులు, ప్రత్యూష తల్లిదండ్రులు ఆమెను తీసుకెళ్లి చెన్నైలో దిగబెట్టారు. వారం తర్వాత ప్రత్యూషను రాధాకృష్ణ తీసుకొచ్చి తమ ఇంటి వద్ద దించేసి వెళ్లిపోయాడని ఫిర్యాదులో ప్రసాద్ పేర్కొన్నారు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. తమ కూతురిని విచారించగా తన బాధలు చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమైందన్నారు. 'హోమియోపతి మెడిసిన్ కోర్సు డిస్‌కంటిన్యూ చేసిన నన్ను ఉద్యోగం చేయాలని బలవంతం చేస్తున్నారు. ఉద్యోగం చేస్తావనే నిన్ను చేసుకున్నాం. రూ.3 కోట్లు కట్నం ఇస్తామన్న సంబంధాలు వదులుకున్నాం. పెళ్లి సమయంలో మీ వాళ్లు ఇస్తానన్న స్థలం అమ్మేసి డబ్బులు తీసుకురా. చెన్నైలో ఫ్లాట్ కొంటాం' అని మానసికంగా వేధిస్తున్నారని చెప్పిందన్నారు. పెళ్లి సమయంలో రూ.5 లక్షలు కట్నం ఇవ్వడంతో పాటు 15 కాసుల బంగారం పెట్టామన్నారు. తాము అల్లుడితో ఫోనులో మాట్లాడడానికి చాలాసార్లు ప్రయత్నించామన్నారు. వినాయక చవితి, దసరాకు రమ్మన్నా ఏదోక సాకు చెప్పేవాడని తెలిపారు. తమ అమ్మాయి భర్తకు ఫోన్ చేస్తే మాట్లాడేవాడు కాదన్నారు. పెళ్లయిన రెండు నెలలకే తన సంసారం ఇలా కావడం, పుట్టింట్లో ఉండిపోవడంపై తీవ్రంగా ఆవేదన చెందడంతో పాటు మానసికంగా కుంగిపోయిందన్నారు. తనకు గుండెపోటు రావడంతో చికిత్స జరిగిందని, అప్పటి నుంచీ ఇంటి దగ్గరే ఉండడంతో తాము నచ్చజెప్తూ వచ్చామన్నారు. అయితే దీపావళి ముందు రోజున బుధవారం రాత్రి తీవ్రంగా ఏడ్చిందన్నారు. తాము సముదాయించామని, కాస్త కుదుట పడిందని అనుకున్నామన్నారు. 11గంటల సమయంలో తన గదిలోకి వెళ్లిపోయిందని చెప్పారు. దీపావళి రోజున ఉదయం ఏడు గంటలకు తన భార్య నాగమణి గది తుడవడం కోసం వెళ్లి చూడగా చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకున్న స్థితిలో ప్రత్యూష కనిపించిందన్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. తన కూతురు మరణానికి భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియ వేధింపులే కారణమని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నారు.

● పుట్టింటి పేరుతోనే...

ప్రత్యూష రాసినట్టు భావిస్తున్న మరణ వాంగ్మూలం లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన అంత్యక్రియలను అత్తవారింటి పేరుతో చేయవద్దని, పుట్టింటి పేరుతోనే చేయాలని అందులో పేర్కొనడం చూస్తే ఆమె ఎంత వేదనకు గురైందోనని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. కేసును సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు. భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియలను అరెస్టు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరచనున్నారు.

మృత్యుంజయులు

- కెరటాల ఉధృతికి సముద్రంలో మునిగిపోయిన ఇద్దరు బాలురు
- మెరైన్ పోలీసుల సూచనతో కాపాడిన మత్స్యకారులు

సర్పవరం జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి నాడు సాయంత్రం సమయంలో ఆనందంగా గడిపేందుకు వెళ్లి సముద్రంలో స్నానానికి దిగి కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న ఇద్దరు బాలురను మెరైన్ పోలీసులు కాపాడారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు గైగోలుపాడుకు చెందిన 16ఏళ్ల పిల్లి గణేష్, 17 ఏళ్ల షేక్ బషీర్ వలీ గురువారం మధ్యాహ్నం సూర్యారావుపేట బీచ్‌కు వెళ్లారు. కొద్దిసేపు ఆనందంగా గడిపిన తర్వాత సముద్రంలో స్నానానికి దిగారు. ఈ సమయంలో కెరటాల ఉధృతికి సముద్రంలో పడి ఇద్దరు మునిగిపోతున్నారు. వాకలపూడి మెరైన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న కాకినాడ మెరైన్ ఏఎస్ఐ మధు, హెడ్ కానిస్టేబుల్ శ్రీను గమనించారు. అక్కడే ఉన్న మత్స్యకారులను అప్రమత్తం చేయడంతో వారు సముద్రంలోకెళ్లి మునిగిపోతున్న గణేష్, బషీర్‌వలీలను కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. బాలురు వివరాలను సేకరించిన ఏఎస్ఐ మధు తల్లిదండ్రులకు సమాచారం అందివ్వడంతో వారు బీచ్‌కు వచ్చారు. ఈసందర్భంగా పిల్లలు, తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. తమ పిల్లలను కాపాడిన పోలీసులు, మత్స్యకారులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మెరైన్ ఏఎస్ఐ మధు, హెచ్‌సీ శ్రీను

పోలీస్ కస్టడీ నుంచి రిమాండ్‌కు శ్రీకాంత్

అమలాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలానికి చెందిన దళిత వలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్యకేసులో ప్రధాన నిందితుడైన పినిపే శ్రీకాంత్, రెండో నిందితుడు ధర్మేష్‌లను మూడు రోజుల పోలీస్ కస్టడీ అనంతరం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. కొత్తపేట డీఎస్పీ గోవిందరావు ఆధ్వర్యంలో గత నెల 30, 31, నవంబరు 1న అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులు ఎండీ అజామ్, కుడుపూడి అశోక్ సమక్షంలో పోలీసులు నిందితులిద్దరినీ ప్రశ్నించారు. పోలీస్ కస్టడీ ముగియడంతో శుక్రవారం పోలీసులు అమలాపురం కోర్టులో హాజరుపరిచారు. శ్రీకాంత్‌కు నాలుగు రోజుల రిమాండ్ ఉండగా, ధర్మేష్‌కు మళ్లీ 14 రోజుల రిమాండ్‌ను కోర్టు విధించింది. దీంతో వారిని సెంట్రల్ జైలుకు తరలించారు.

'పోలవరం'పై జగన్

అనవసర రాద్ధాంతం

అభివృద్ధి ఓర్వలేకే ప్రభుత్వంపై ఆరోపణలు: కార్మిక శాఖ మంత్రి సుభాష్



రామచంద్రపురంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనవసరపు రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ పోలవరం ప్రాజెక్టుపై దృష్టిసారించకుండా కాలయాపన చేశారన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో రూ.628 కోట్లు ఆదా చేసినట్టు గొప్పలు చెప్పుకుని రూ.2,268 కోట్ల అదనపు భారం మోపారన్నారు. సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రూ.11,762 కోట్లతో 73శాతం పనులు పూర్తి చేయగా జగన్ హయాంలో రూ.4,100 కోట్లతో 3.28 శాతం పనులు మాత్రమే చేశారన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయన్నారు. తమ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వ లేకే జగన్ విషవాయువులు వదులుతున్నారన్నారు. ప్రాజెక్టు తొలిదశను పూర్తి చేసేందుకు రూ.30,436 కోట్లు ఇవ్వడానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆగదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు శ్రమిస్తూనే ఉంటారన్నారు. ఇటీవలి ప్రకృతి వైపరీత్యాలు, కార్తీక మాసం కూరగాయల ధరలపై కొంత ప్రభావం చూపిన మాట వాస్తవేమన్నారు. నూనెలు, మినపపప్పు, పెసరపప్పు, చింతపండు ధరలు అదుపులోనే ఉన్నాయన్నారు. నిత్యావసర వస్తువు ధరలపై మాట్లాడేందుకు వైసీపీ నాయకులు చర్చకు సిద్ధమా అన్నారు. నిత్యం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విహారంలో విషాదం

సోకిలేరు వాగు ఉధృతిలో కొట్టుకుపోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మార్చురీలో సాయికృష్ణ మృతదేహం

చింతూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద వాగు ఉధృతిలో కొట్టుకుపోయి అమినిగడ్డ సాయికృష్ణ (29) మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి సోదరుడు రవీంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ప్రకాశం జిల్లా కాకుటూరివారిపాలేనికి చెందిన సాయికృష్ణ, నాగసాయి, నాగార్జున, రవీంద్ర, వంశీ హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో వంశీ మినహా మిగిలిన నలుగురూ అన్నదమ్ముల పిల్లలు. వంశీ వీరందరికీ స్నేహితుడు. కాగా దీపావళి సందర్భంగా వచ్చిన సెలవుల నేపథ్యంలో వీరంతా పర్యాటక ప్రదేశాలను సందర్శించాలనుకున్నారు. ఈ క్రమంలో మూడు ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్ నుంచి ఈ ఐదుగురు గురువారం బయల్దేరారు. శుక్రవారం ఉదయం భద్రాచలం చేరుకుని సీతారామచంద్రస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. దీంతో ప్రయాణం చింతూరు మండలం మీదుగా సాగింది. మార్గమధ్యంలో సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద ఆగారు. అప్పటికే పలువురు పర్యాటకులు సోకిలేరు వాగు నీటిలో స్నానం చేసున్నారు. అది చూసిన యువకులు కూడా వాగులో స్నానం చేయాలనుకున్నారు. ఈ క్రమంలో సాయికృష్ణ, నాగసాయి, నాగార్జున కూడా వాగులోకి దిగారు. నీటి ఉధృతికి సాయికృష్ణ కొట్టుకుపోయాడు. దీనిని గమనించిన అక్కడున్న పర్యాటకుల సహకారంతో సాయికృష్ణ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి మిగిలిన నలుగురూ సాయికృష్ణ మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి ఆటోలో తరలించారు. ఆసుపత్రి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు.

మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌పై సస్పెన్షన్ వేటు

మండపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట రూరల్ ఎస్ఐ డి.సురేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 28న మండపేట మండలం ఏడిదలో ఒక ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలి ఒక వ్యక్తి మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఆ ఘటనకు ఎస్ఐ సురేష్ నిర్లక్ష్యమే కారణమంటూ సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిసింది. ఎటువంటి సంబంధం లేని ఎస్ఐను సస్పెండ్ చేయడాన్ని సహచర సిబ్బంది జీర్ణించుకో లేక పోతున్నారు. ఈ అంశం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

చినజీయర్‌స్వామి తిరునక్షత్రం

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): త్రిదండి చినజీయర్‌స్వామి తిరునక్షత్రం (జన్మదినోత్సవం) సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో రామానుజదాసుడు వరదా సూరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అంతర్వేదిలో తాటాకిల్లు దగ్ధం

అంతర్వేది, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అంతర్వేది గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక మడకం మేరీకి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. రూ.లక్ష ఆస్తి నష్టం ఏర్పడింది. రాజోలు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. స్థానికుల సహాయంతో కొంత సామగ్రిని తీయగా మిగిలినవన్నీ కాలిపోయాయని నవీన్ వాపోయాడు.

దీపావళి వెలుగులు



మలికిపురం: దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తన క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, టీడీపీ నాయకులు ముప్పర్తి నాని, చాగంటి స్వామి, గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలను ముమ్మిడివరంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలుచేసి ఇష్టమైన వంటకాలు నైవేద్యంగా సమర్పించారు. ప్రతీ ఇంటినీ నూనె ప్రమిదలతో ఇంటి చుట్టూ దీపాలు ఉంచి అలంకరించారు. చిన్నారులతో కలిసి టపాసులు కాల్చి ఆనందంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. కొత్త అల్లుళ్ల రాకతో పల్లెల్లో దీపావళి సందడి చోటు చేసుకుంది. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని ప్రజలు గురువారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. లక్ష్మీపూజచేసి గురువారం రాత్రి బాణసంచా కాలుస్తూ ఆనందోత్సాలను పంచుకున్నారు. ఒకరినొకరు దీపావళి శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. చిన్నపిల్లల మతాబులు, కాకరకొవ్వొత్తులు కాల్చి సందడి చేశారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ప్రజలు దీపావళి పండుగను గురువారం ఘనంగానిర్వహించుకున్నారు. ఇళ్లు, ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళలు లక్ష్మీదేవి పూజలు చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

యానాం,(ఆంధ్రజ్యోతి): యానాంలో దీపావళి వేడుకలను ప్రజలు గురువారం రాత్రి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో లక్ష్మీదేవికి పూజలు చేశారు. ఇళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించారు. చిన్నారులు, యువకులు టపాసులు కాల్చారు. ఆకాశంలో బాణసంచా వెలుగులు విరజిమ్మాయి. యానాంలో 30కిపైగా బాణసంచా దుకాణాలకు అనుమతి ఇవ్వడంతో ఉమ్మడి తుర్పుగోదావరి జిల్లా నుంచి పలువురు వాహనాల్లో వచ్చి భారీగా కొనుగోలు చేశారు. ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ రాజశేఖర్ నేతృత్వంలో సీఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, నూకరాజు, వీరభద్రస్వామి పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం



అమలాపురంలో పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం సర్క్యులర్ బజార్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. క్లబ్ అధ్యక్షురాలు భమిడిపాటి పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి యల్లమిల్లి అనంతలక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, జోన్ చైర్‌పర్సన్ పచ్చిగోళ్ల సత్యకుమారి, శ్రీగిరి పద్మావతి, గోపాలకృష్ణ, కనకాద్రిశాస్త్రి, గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్స్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, కముజు సుందరరావు, ఈతకోట సత్యనారాయణ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అవరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, ఏవో కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్, చోడే జాన్‌పాల్, ఎం.సూర్యకుమారి, సీలి సంసోను పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

అల్లవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయమని ఆర్యవైశ్య నాయకులు, జనసేన నాయకులు పేర్కొన్నారు. అల్లవరం, కొమరగిరిపట్నం గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులుర్పించారు. మండల ఆర్య వైశ్య సంఘపెద్దలు గమిడి సూరిబాబు, వెదుళ్ళపల్లి సుబ్రహ్మణ్యం, మోటమర్రి వెంకటరమణ, జనసేన నాయకులు పిండి గణపయ్య, నల్లా రాము, ఆర్యవైశ్య యువనాయకులు వెదుళ్ళపల్లి శివ, గ్రంధి వీరబాబు, మన్యం శ్రీనివాస్, ఉద్దగిరి శేషగిరి, మోటమర్రి చిట్టిబాబు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి

అంబాజీపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని వైశ్య సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైశ్య సంఘ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాసు శ్రీనివాసరావు, గోకవరపు శివ, కాసు సాయిబుజ్జి, పులవర్తి మల్లిబాబు, కుమ్మరగుంట్ల వెంకటేశ్వరరావు, యెండూరి అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములకు ఘన నివాళి

పి.గన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మానేపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పెంటపాటి వెంకటేశ్వరరావు, నూలు మురళీకృష్ణ, శ్రీకాకుళపు వెంకటే శ్వరరావు, శిరం శ్రీనివాసరావు, గెల్లి వెంకటరత్నం, గెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం





ముమ్మిడివరం: సిలిండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, రాజోలు: సిలిండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే దేవ, అయినవిల్లి: సిలిండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

- ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
- ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

ముమ్మిడివరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అమలుచేస్తూ మరోపక్క రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో హెచ్‌పీ గ్యాస్, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఉచిత గ్యాస్ పథకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధిని అథోగతి పాలు చేసి, అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. తిరిగి రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు చంద్రబాబునాయుడు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. సూపర్-6 పథకాల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని, త్వరలోనే మిగిలిన హామీలన్నీ కూడా అమలు చేస్తారన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడిన రసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, గుద్దటి జమ్మి, దూడల స్వామినాయుడు, బద్రి రమా, దాట్ల బాబు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, చెల్లి సురేష్, చింతలపూడి కొండబాబు, బొంతు నాగరాజు, మెండి కమల, బొక్కా రుక్మిణి, కొండేటి వెంకటలక్ష్మి, పెదపూడి రుక్మిణి, కాశి లాజర్, సత్తి నూకరాజు, గోదశి గణేష్, మట్టా సత్తిబాబు, లోకినీడి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీను, కట్టా సత్తిబాబు, కురసాల శివబాబు, జాగు సత్తిబాబు, సరిపల్లి శ్రీనివాసరాజు, తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో తాడి వెంకటాచార్య, హెచ్‌పీ గ్యాస్‌ఏజెన్సీ డీలర్ పీఎస్సార్ సోమయాజులు, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో సిలిండర్ల పంపిణీ

కాట్రేనికోన, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకంలో భాగంగా శుక్రవారం కాట్రేనికోనలో ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఇండేన్ గ్యాస్ కార్యాలయం వద్ద జరిగిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, శీలం సూర్యనారాయణ, విత్తనాల బుజ్జి, గ్రంధి నానాజీ, పచ్చిమట్ల సూర్యనారాయణరాజు, వంగా దుర్గబాబు, వత్సవాయి రవివర్మ, రేవు రమేష్, సత్రాల ప్రసాద్, వాసంశెట్టి రాజేశ్వరరావు, విత్తనాల రమణ, గుబ్బల నాగేశ్వరరావు, ఏజన్సీ డీలర్ మేడా రాము పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

అయినవిల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అయినవిల్లిలో దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేస్తుందన్నారు. కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. వి.విశంకరప్రసాద్, తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీవో భీమారావు, డొక్కా నాథ్‌బాబు, పోలిశెట్టి రాజేష్, మద్దాల సుబ్బారావు, సలాది పుల్లయ్యానాయుడు, వారాలక్ష్మీనరసింహరామ్, సలాది బుచ్చిరాజు, మేడిద దుర్గాప్రసాద్, నేదునూరి వీర్రాజు పాల్గొన్నారు.

మరో హామీ అమలు

రాజోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ మేనిఫెస్టోలో సూపర్-6 అమలులో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా శ్రీను అధ్యక్షతన శుక్రవారం జరిగిన పంపిణీ కార్యక్రమానికి ఆయన మాట్లాడారు. దీపం పథకం కోసం సంవత్సరానికి రూ.2694 కోట్లను కూటమి ప్రభుత్వం వెచ్చిస్తుందని తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో దీపం-2 పథకం ద్వారా 73,180 గ్యాస్ కనెక్షన్ల లబ్ధిదారులకు లబ్ధి చేకూరనుందన్నారు. దీపావళి వేళ ప్రతీ కుటుంబంలో వెలుగులు నింపే పథకం దీపం-2 అన్నారు. గ్యాస్ కనెక్షన్, రేషన్, ఆధార్‌కార్డు ఉన్న ప్రతీ లబ్ధిదారునికి ఈపథకం వర్తిస్తుందన్నారు. దీపం పథకం కింద గ్యాస్ బుక్ చేసుకున్న 24గంటల్లో సిలిండర్ అందేలా 48గంటల్లో లబ్ధిదారులు చెల్లించిన మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రాజు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, రాజోలు మండలం జనసేపార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, వైఎస్ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, రాజోలు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులకు మహర్దశ



రోడ్డు పనులపై ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్రతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ప్రధాన రహదారులను పూర్తిగా విస్మరించడంతో దయనీయంగా తయారయ్యాని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వంలోనే రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. పి.గన్నవరం సెంటర్‌లో పి.గన్నవరం-అంబాజీపేట రోడ్డు పనులపై డీఈ రాజేంద్రతో చర్చించి అనంతరం మాట్లాడారు. రూ.8కోట్లతో గన్నవరం నుంచి అంబాజీపేట వరకు (6.5కిలోమీటర్లు) రహదా రిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. జనవరి నాటికి కొంత మేర, మిగిలినది మార్చిలోపు పూర్తి స్థాయిలో రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. ముంగండ రక్షిత మంచినీటి సరఫరా ప్రాజెక్టుకు సంబంధించి గొట్టాల విషయంలో ఇరుశాఖలు ఉమ్మడి పరిశీలనలు చేసి పైపులైన్లకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి నిమ్మకాయల వీరవెంక టసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కుమార్, చొల్లంగి సత్తిబాబు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్య నా రాయణ, శేరు శ్రీనుబాబు, గుత్తుల చంటి, తాటికాయల శ్రీనివాసరావు, యడ్ల ఏసు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా శైవక్షేత్రాలు



విద్యుద్దీపాలంకరణలో ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణ ముక్తీశ్వరాలయం

అయినవిల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణముక్తీశ్వరాలయం, తొత్తరమూడిలో ముక్తీశ్వర శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆలయ కాన్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఆర్‌అండ్‌బీ గుంతలను పూడ్చేందుకు రూ.18కోట్లు మంజూరు



అమలాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రహదారులను గుంతల రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నట్టు జిల్లా రహదారులు, భవనాల శాఖ ఇంజనీర్ బి.రాము శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఆర్‌అండర్‌బీ రహదారిపై ఉన్న గుంతలను పూడ్చేందుకు 71 పనులకుగాను రూ.18కోట్ల నిధులకు ఆమోదం లభించిందని తెలిపారు. శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆయా పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. మరో 72 పనులకు రూ.20 కోట్లు నిధులు వారం రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ పనులన్నింటినీ జనవరి నెలాఖరు నాటికి పూర్తిచేసి జిల్లాలో గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. పి.గన్నవరం మండల పరిధిలోని పోతవరంలో ఆర్‌అండర్‌బీ గుంతలు పూడ్చే పనులను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం ప్రారంభిస్తారని రాము తెలిపారు.

పింఛన్ల పంపిణీలో అల్లవరం జిల్లాలో రెండో స్థానం

అల్లవరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో 93శాతం పింఛన్లు పంపిణీ చేసి అల్లవరం మండలం రెండో స్థానంలో నిలిచిందని ఎంపీడీవో బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. మొత్తం 9,332పింఛన్లకు సాయంత్రం 5గంటలకు 8,687 పింఛన్లు పంపిణీ చేశారన్నారు. చాలా చోట్ల సర్వర్లు పనిచేయక పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తడంతో సాయంత్రం పింఛన్ల పంపిణీ పునఃప్రారంభించారు.

అంతర్వేది,(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో పెన్షన్ల పంపిణీకి మండలస్థాయి, సచివాలయ అధికారులు, సిబ్బంది సన్నద్ధమయ్యారు. సర్వర్లు పనిచేయకపోవడంతో మధ్యాహ్నం నుంచి పెన్షన్ల పంపిణీని చేపట్టారు. రాత్రి కూడా పెన్షన్లు పంపిణీ చేయడంలోఅధికారులు, సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా పనిచేశారని పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేశారు.

రాజోలు,(ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లు ప్రతీ కుటుంబానికి భరోసా వంటిదని రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం శివకోటిలో జరిగిన పెన్షన్ల పంపిణీలో ఆయనమాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి,ఎంపీటీసీ బొడ్డు కృష్ణారావు, కడలి ఏడుకొండలు, మెరుగు ముప్పల సత్యవరప్రసాద్, పితాని సత్యనారాయణ, మట్టపర్తి రమేష్, కంకటాల బాబి, ధర్మవరపు చినసత్యనారాయణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	అమరన్
శ్రీలలిత	క
శేఖర్ స్క్రీన్-1	విశ్వం
శేఖర్ స్క్రీన్-2	సింగం
రమా	లక్కీ భాస్కర్
గణపతి	వెట్టాయన్
వెంకటపద్మావతిస్క్రీన్-1	బఘీర
వెంకటపద్మావతి స్క్రీన్-2	వెనమ్

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఐ.పోలవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి, క్రిస్మస్ సందర్భంగా ఐఆర్ ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం మండల శాఖ కోరింది. మురమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకెళ్ల సూర్యమోహన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల మాదిరిగా ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించాలని సమావేశంలో కోరారు. ప్రధాన కార్యదర్శి వెన్న వీరవెంకటసుబ్రహ్మణ్యం, నిమ్మన సత్యనారాయణ, జొన్నాడ రవికిరణ్, డి.నారాయణరావు, గుత్తుల వెంకటేశ్వర్లు, చెరుకూరి రామకృష్ణ, కొప్పిశెట్టి నాగబాబు పాల్గొన్నారు.

బంగారం చోరీ

వృద్ధురాలి తలపై రుబ్బురోలు పాత్రంతో దాడి

పది కాసుల బంగారం అపహరణ

కాట్రేనికోన, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తి దాడిచేసి పది కాసుల బంగారం అపహరించాడు. పల్లంకుర్రు పంచాయతీ కసిరెడ్డివారి వీధిలో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో టీవీ చూస్తున్న కసిరెడ్డి నాగమణి తలపై రుబ్బురోలు పొత్రంతో కొట్టి సుమారు పది కాసుల బంగారం దోచుకున్నట్టు స్థానికులు తెలిపారు. గాయపడిన నాగమణిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. నాగమణి భర్త 80ఏళ్ల రామం పక్క గదిలో ఉన్నాడు. ఆయన నడవలేని స్థితిలో ఉన్నాడు. ఆమెకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు పదేళ్ల వయస్సులో మృతిచెందాడు. మరో కుమారుడు కాకినాడలో నివాసం ఉంటున్నాడు. అయితే ఇద్దరూ వృద్ధులు ఉంటారని భావించి గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడి బంగారం అపహరించాడని స్థానికులు భావిస్తున్నారు. ముమ్మిడివరం సీఐ కుమార్, ఎస్ఐ అవినాష్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థిని పరిశీలించారు. కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్ వచ్చి చుట్టు ప్రక్కల ప్రాంతాలు పరిశీలిచింది.

అట్రాసిటీ కేసు నమోదుచేయాలి

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండపేటలో దళిత యువకులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు డిమాండు చేశారు. బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. శుక్రవారం అమలాపురంలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావులు మాట్లాడారు. సమావేశం గెడ్డం విజయ్‌కుమార్, పొలమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు 6వరకు గడువు

అంబాజీపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు కోసం ఈనెల6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. 2022 అక్టోబరు 31కి ముందు డిగ్రీ పూర్తిచేసి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు అప్లికేషన్, పదో తరగతి, డిగ్రీ, ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలపై గెజిటెట్ సంతకాలతో పాటు పాస్‌పోర్టుఫొటోను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటును నమోదు చేసుకోవచ్చన్నారు.

ఎల్ఈడీ టీవీ బహూకరణ

ఐ.పోలవరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాదుకు చెందిన మాచిరాజు వెంకటసత్యసర్వేశ్వరసాయిరామ్ ఎల్ఈడీ టీవీని ఈవో లక్ష్మీనారాయణకు శుక్రవారం టీవీని అందించారు. దాతను ఈవో అభినందించారు.

సీసీ రోడ్డు వేయాలని వినతి

అంతర్వేది, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో బుంగవారిపేట, చొప్పలవారి గ్రూపులకు రింగ్ రోడ్డుకు సీసీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసిన అంతర్వేది గ్రామస్తులు 25ఏళ్లుగా గ్రామంలో మారుమూల ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో అంతర్వేది దేవస్థానం గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుదుచ్చేరి విమోచన దినోత్సవం




జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్ఏ మునిస్వామి, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, చిన్నారుల నృత్య ప్రదర్శన

యానాం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): యానాంలో శుక్రవారం పుదుచ్చేరి విమోచన దినత్సోవాన్ని (లిబరేషన్‌డే) ఘనంగా నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగాణంలో యానాం పాలనాయంత్రాంగం ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్యఅతిథిగా యానాం పరిపాలనాధికారి మునిస్వామి హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసులు, విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజర య్యారు. ఈసందర్భంగా శాంతిక పోతాలను, మువ్వన్నెల బెలూన్స్‌ను గాలిలోకి ఎగురవేశారు. అనంతరం పోలీసులు, ఐఆర్‌బీ, హోంగార్డు, విద్యార్థులు కవాతు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ సాధించిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ వర్ధంతి



అమలాపురంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో హైస్కూలు సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయురాలిగా కొనియాడారు. దేశ సంక్షేమం కోసం 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాలను తీసుకువచ్చిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు యార్లగడ్డ రవీంద్ర, ముషిణి రామకృష్ణారావు, కుడుపూడి శ్రీనివాస్, దేవరపల్లి రాజేంద్రబాబు, జోగి అర్జునరావు, పేరి శర్మ, మహబూబ్ షకీలా, పులుసుగంటి ప్రకాష్, వస్కా బాబు, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో నిర్వహించారు. స్థానిక పోలమ్మచెరువుగట్టున ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు పెన్మెత్స జగ్గప్పరాజు, పి.ఉదయభాస్కరవర్మ, పాలెపు ధర్మారావు, వడ్డి నాగేశ్వరరావు, దివి వెంకన్నబాబు, ముషిణి శివప్రసాద్ పాల్గొన్నారు.

కాట్రేనికోన,(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ పాలెపు ధర్మారావు ఆధ్వర్యంలో శుక్రవారం కాట్రేనికోనలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో అయితాబత్తుల పండుబాబు, పాలెపు ధర్మరాజు, కాశి హనుమంతరావు, గిడ్ల గణేష్, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా ఇందిరాగాంధీ అందిచిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ 40వ వర్ధంతిని నగరం గ్రామంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహ్మద్ ఆరీఫ్, అప్పన శ్రీరామకృష్ణ, కొండేటి వెంకటేశ్వరరావు, బొరుసు రాజేందర్, వాఐరాశి దుర్గారావు, ఎన్.వెంకటేశ్వరరావు, విత్తనాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులకు సహకారమందిస్తా

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు చెందిన క్రీడాకారులు రాణించాలన్నదే తన ఆకాంక్ష అని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో జరిగే వివిధ క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మార్టేరులో ఇటీవల జరిగిన అండర్-17 బాస్కెట్ బాల్‌పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరుపున ఎంపికైన అంబాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిమ్మకాయల చరిష్మసాయిరుత్వి, అండర్-14 స్కేటింగ్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.కుమార్‌చంద్‌శ్రీధర్‌ను కలెక్టర్ అభినందించారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. డీఈవో ఎస్కే సలీంబాషా, క్రీడాభారతి ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పీడీ కె.ఆదిలక్ష్మి, డీవైఈవోలు మధుసూదనరావు, జి.సూర్యప్రకాశం, హెచ్‌ఎం కామేశ్వరరావు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతి ఐక్యతకు, ప్రజల మధ్య సోదర భావాన్ని పెంపొందించేందుకు ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పునాదులు వేశారని కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు పేర్కొన్నారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సమైక్యతా ప్రతిజ్ఞ చేయించారు. కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, భూసేకరణ ఉప తహసీల్దార్ ఏసుబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ సస్పెన్షన్

పి.గన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం ఫీల్డ్ అసిస్టెంట్ సరెళ్ల సుబ్బరాజును అధికారులు సస్పెండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ పలు పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, గ్రామానికి చెందిన ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, గ్రామస్తులు సెప్టెంబరు 3న అధికారులకు ఫిర్యాదు చేశారు. సెప్టెంబరు 26న ఉపాధి హామీ ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదికను డ్వామా పీడీకి అందించారు. దీనిపై అక్టోబరు 28న ఫీల్డ్‌అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ పీడీ మధుసూదన్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు.

మంత్రిని కలిసిన ఆర్టీవో



అమలాపురం టౌన్, నవంబరు 1(ఆం ధ్రజ్యోతి): రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శుక్రవారం జిల్లా రవాణాశాఖాధికారి డి.శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

3న శెట్టిబలిజ కార్తీక వనసమారాధన

రాజోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తాటిపాక శెట్టిబలిజ సంక్షేమ సంఘ భవనం వద్ద ఈనెల3న ఆదివారం ఉదయం 9గంటల నుంచి కార్తీకమాస వనసమారాధన కార్యక్రమం రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ ఆధ్వర్యంలో జరుగుతుందని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు తెలిపారు.


ర్యాలిలో రోడ్డుపక్కనే అపారిశుధ్యం, సీసీ రోడ్డు మీదే వ్యర్థాలు

రోడ్డుమీదే చెత్త

అలంకారప్రాయంగా సంపద కేంద్రాలు
పల్లెల్లో అపారిశుధ్యం విలయతాండవం
పట్టించుకోని అధికారులు

ఆత్రేయపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించి సేంద్రియ ఎరువులను తయారు చేయడమే లక్ష్యంతో చెత్త సంపద కేంద్రాలు లక్షలాది రూపాయలతో నిర్మించారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందించిన రిక్షాలు మూలనపడ్డాయి. చెత్త సంపద కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. ముఖ్యకూడలిలలో రోడ్ల మీదే చెత్తా చెదారం విలయతాండవం చేస్తోంది. పల్లెల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. రోడ్లపై ప్రయాణించే చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ముక్కుమూసుకుని పరుగులు పెడుతున్నారు. దుర్గంధాలను రోడ్లపైనే వేస్తున్నారు. ప్రజలు సైతం అనారోగ్యాలబారిన బారిన పడుతున్నారు. దోమలు విజృంభిస్తున్నాయి. పంచాయతీ పాలకులు దృష్టిపెట్టకపోవడంతో పల్లెల్లో ప్రజలు జ్వరపీడిత బాధితులు అవుతున్నారు. ముఖ్యంగా మేజర్ గ్రామమైన ర్యాలిలో అపారిశుధ్యం విలయతాండవం చేస్తుంది. జడ్పీ హైస్కూల్‌కు వెళ్లే సీసీ రోడ్డుమీదే చెత్తాచెదారం వేస్తున్నారు. చేపలు మార్కెట్ ఈ ప్రాంతంలో ఉండటంతో వ్యర్థాలు రోడ్డుపైనే విడిచివెళ్తున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డు డంపింగ్‌యార్డుగా మారింది. ఆసుపత్రి, హైస్కూల్‌కు వెళ్లే రోడ్డుమార్గం కావడంతో విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ముక్కుమూసుకుని పరుగులు పెడుతున్నారు. గ్రామంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రానికి తాళాలు వేసి అలంకారప్రాయంగా ఉంచారు. స్వచ్ఛభారత్ రిక్షాలు మూలనపడ్డాయి. జిల్లాఅధికార యంత్రాగం సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి అపారిశుధ్యం నిర్మూలించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైన ఉంది.


నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

• ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


రావులపాలెంలో గ్యాస్ సిలెండర్లను ఇస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో దీపం పథకంద్వారా లబ్ధిదారులకు గ్యాస్ సిలండర్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యానందరావు, జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీని వాస్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొని లబ్ధిదారులకు సిలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలుపూరి సతీష్‌రాజు, మండలశాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాస్, ఆర్డీవో శ్రీకర్, జనసేన మండల అధ్యక్షుడు తోట స్వామి, బండారు బాబి, కూటమి శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

దీపం గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ

మండపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ సూపర్ సిక్స్‌పథకాల అమలుకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణలు చెప్పారు. సూపర్ సిక్స్‌పథకం అమల్లో భాగంగా ఏడాదికి 3ఉచిత గ్యాస్ సిలెండర్‌లు అంద జేస్తుందన్నారు. పట్టణంలో దీపం 2లో భాగంగా ఉచిత సిలెండర్‌లను స్థానిక గ్యాస్‌కంపెని వద్ద జరిగిన కార్యక్రమంలో శుక్రవారం నేతలు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్యాస్ కంపెనీ డీలర్ టిక్కిన చిన్న పాల్గొన్నారు.


గ్యాస్ సిలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

'ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడటమే ధ్యేయం'

రావులపాలెం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు అన్నివిధాలా కృషిచేస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారవాణాకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీ సత్యనారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, చిలుపూరి సతీష్‌రాజు, తోట స్వామి, బండారు బాబి, కూటమి నేతలు పాల్గొన్నారు.

వైసీపీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రబ్బానీ రాజీనామా

మండపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపాల్టీ పాలకవర్గంలో వైసీపీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌రబ్బాని తన కోఆప్షన్ పదవికి రాజీనామాచేసి మున్సిపల్ కమిషనర్‌కు తన రాజీనామా లేఖను అందజేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అతడికి లభించిన కోఆప్షన్ పదవిలో ఆయన ఇప్పటివరకు కొనసాగారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ యారమాటి గంగరాజు రబ్బానిపై కేసులు గురించి ప్రస్తావించారు. కేసులు ఐపీ దాఖలు చేసినవారు కౌన్సిల్‌లో ఉండవచ్చా అంటూ ప్రశ్నించారు. దీనిపై వచ్చే కౌన్సిల్ నాటికి సమాధానంను అధికారులు ఇచ్చారు. యారమాటి అడిగిన ప్రశ్నల నేపథ్యంలో కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్ రబ్బానికి కమిషనర్ నోటీసు జారీ చేశారు. రబ్బాని తన కుటుంబ వ్యక్తిగత కారణాల దృష్ట్యా కోఆప్షన్ పదవికి రాజీనామా చేస్తున్నానని కమిషనర్‌కు అందజేసిన లేఖలో పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రంగారావు రాజీనామా చేసిన మాట వాస్తవమేనని ధ్రువీకరించారు.

ఆలమూరు ఎంపీడీవోగా రాజు



ఆలమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఏ.రాజును నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆలమూరులో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న రాజుకు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కె.జాన్‌లింకన్ అక్టోబరు 31న పదవీ విరమణ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించనున్న రాజును పలువురు అభినందించారు.

పురుగుల మందు తాగి బాలుడి మృతి

ఆలమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన తాతపూడి రోహిత్ (13) అనే బాలుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఆల మూరు ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపారు. రోహిత్ ఆలమూరులోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడని, స్కూల్ టీచర్ మందలించారని మనస్తాపంతో పురుగుల మందు తాగి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రె స్ (ఏఐటీయూసీ)105వ ఆవిర్భావ దినోత్సవం గురువారం మున్సిపల్ కార్యాలయంవద్ద నిర్వహించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.గోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ దేశంలో మొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ బొంబాయి మహానగరంలో 31 అక్టోబరు 1920లో స్వాతంత్ర సమరయోధుడు లాలాలజపతిరాయ్ అధ్యక్షతన ఏర్పడిందన్నారు. 104 ఏళ్లలో ఏఐటీయూసీ కార్మిక హక్కులతోపాటు దేశస్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర వహించిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తోట సూరిబాబు, జి.రాజు, బి.సత్యనారాయణ, ఏ.మాచర్రావు, ఎం.గోపి, ఎస్.సుధా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు వెంకటేశ్వరరావు, జె.సత్యనారాయణ, బి.నాగేశ్వరరావు, జి.రాము, ఎం.ప్రేమానందం, ఎస్.శారదాదేవి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

మండపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం రూ.2,22,233 చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం బాధితులకు పార్టీ కార్యాలయంలో అందజేశారు.

దళిత యువకులపై దాడి హేయమైన చర్య : ఎమ్మార్పీఎస్

మండపేట, నవంబరు1: మండపేటకు చెందిన దళిత యువకులపై అగ్రవర్ణ యువకులు దీపావళి పండుగరోజున దాడిచేయటం హేయమైన చర్య అని ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ సుబ్బారావు మాదిగ అన్నారు. దాడిని ఆయన ఖండించారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు దూళి జయరాజు తదితరులతో కలిసి బాధిత యువకులను జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని లేకుంటే ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

మద్యంషాపు ఏర్పాటును నిరసిస్తూ ధర్నా

• వెల్ల సావరం గ్రామస్థుల ఆందోళన


ధర్నా నిర్వహిస్తున్న రామచంద్రపురం మండలం వెల్లసావరం మహిళలు


మండపేట: గొల్లపుంతకాలనీ దారిలో ఆందోళన చేస్తున్న స్థానికులు

ద్రాక్షారామ, నవంబరు1(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం వెల్ల వద్ద ఆదివారపుపేట రోడ్డులో మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ వెల్లసావరంనకు గ్రామస్థులు, విద్యార్థినులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో ఆదివారపుపేట రోడ్డు పక్క మద్యంషాపు ఏర్పాటుకు పనులు చేస్తున్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న మహిళలు శుక్రవారం ఉదయం బ్రాందీషాపు ప్రాంతంలో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. బ్రాందీషాపు తరలించాలని నినాదాలు చేశారు. వెల్లసావరం తదితర గ్రామాల నుంచి వెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు మద్యంషాపు కారణంగా ఇబ్బందులు వస్తాయని వారు ఆరోపించారు. మళ్లీ అదే ప్రాంతం వద్ద మద్యంషాపు ఏర్పాటుతో పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు, మహిళలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు. మద్యంషాపు దూరంగా తరలించాలని కోరారు. మంత్రి సుభాష్ జోక్యం చేసుకుని మద్యంషాపు ఇక్కడి నుంచి తరలించాలని కోరారు. ధర్నా అనంతరం రామచంద్రపురం ఆర్డీవో, ఎక్సైజ్ సీఐ, వెల్ల పంచాయతీ కార్యదర్శిలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్. కిరణ్‌కిషోర్, వాసా బసవకుమార్, గాడా దుర్గా ప్రసాద్, బంటు కాశీభగవాన్, కురసాల సుబ్బారావు, నూకెళ్ల భవానీ శంకర్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గొల్లపుంతకాలనీ వద్ద ఆందోళన

మండపేట, అక్టోబరు,1,(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలోని గొల్లపుంతకాలనీకి వెళ్లేదారిలో నాలుగురోడ్ల కూడలి వద్ద మద్యం దుకాణం వద్దంటూ స్థానికులు గురువారం ఆందోళనకు దిగారు. నూతనంగా ఏర్పాటుచేసే మద్యం దుకాణం ఇక్కడ పెట్టడం కుదరదని వారు హెచ్చరించారు. టీడీపీ నాయకుడు టీఎస్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు సారథ్యంలో స్థానికులు మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. జనవాసాల నడుమ మద్యం దుకాణం పెట్టడంవల్ల కలిగే ఇబ్బందులను ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. దుకాణం ఏర్పాటుచేస్తే ఉద్యమిస్తామని వారు హెచ్చరిస్తూ వారు ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, గెడా(శ్రీనివాస్, గుత్తిసత్తిరాజు, వ(రైసత్యన్నారాయణ, బాబీ, సాయి అచారీ, చినబాబు స్థానికులు పాల్గొన్నారు. ఆందోళనను పట్టించుకోకుండా నిర్వాహకులు మద్యం దుకాణాన్ని ప్రారంభించారు.

కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు


విద్యుత్ కాంతుల్లో కోటిపల్లి సోమేశ్వరస్వామి ఆలయం


రాయవరం: బాల త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి

కె.గంగవరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసంలో శివ భక్తులు పరమేశ్వరుడిని కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వర స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేస్తుంటారు. భక్తులు వేకువజామునుంచే గోదావరినదిలో పుణ్యస్నానాలుచేసి స్వామిని దర్శించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో భీమశంకరం ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్తీక దీపాలు వెలిగించే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన శివాలయాలు

రాయవరం: రాయవరం మండలంలో ప్రముఖ శైవక్షేత్రాలుగా పేరుగాంచిన సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలు కార్తీకమాసం పూజలకు ముస్తాభవుతున్నాయి. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి అష్టదిక్కుల్లో ప్రతిష్ఠ జరిపిన 8 శివాలయాల్లో దక్షిణ దిక్కున ఉన్న పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయంతోపాటు వాయువ్య దిక్కున ఉన్న బాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయా ల్లో నెలరోజుల పాటు పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాయవరం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, రాయవరం రాజేశ్వరస్వామి, లొల్ల రామలింగేశ్వరస్వామి, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీకమాసం పురస్కరించుకుని అభిషేకాలు, అర్చనలు, బిల్వార్చనలు, దీపోత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసం పురష్కరించుకుని ఆలయాలను ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాలవద్ద ఆలయాల ఈవోలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి పుష్కరఘాట్లను శుభ్రం చేశారు. ఘాట్లలో మట్టి, చెత్త చెదారా న్ని ఆయా గ్రామాల కార్యదర్శులు కె.శివచక్రవర్తి, ఎన్‌వీవీఎస్ఎన్ బ్రహ్మాజీరావు, ఆర్ఎస్ వి.కామేశ్వరరావులు పంచాయతీ కార్మికులు, సిబ్బందిచే శుభ్రం చేయిస్తున్నారు. ఘాట్‌లవద్ద అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్‌లు సాకా శ్రీనివాస్, జి.శ్రావణి, సత్యనారాయణలు, కార్యదర్శులు తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


ర్యాలిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేలు పింఛన్లు అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ర్యాలిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, పెండెం వెంకన్న, మెర్ల నాగయ్య, పాలంగి రవిచంద్ర, బందెల గురుయ్య, ఎంపీడీవో వెంకటరామన్ పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం మండలంలో లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్వహించారు. మండల పరిధిలోని లక్ష్మీపోలవరంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం : ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): 1వ తారీఖు ఉదయాన్నే మండల పరిధి వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన హామీ మేరకు రూ.1000 పెంచి రూ.4వేలు పింఛను అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. కార్యక్రమంలో బండారు బుల్లితాత, చీకట్ల అబ్బు తదితరులు పాల్గొన్నారు.

జీయర్ జన్మదిన వేడుకలకు సురుచి లడ్డూ


మైహోమ్ అధినేత కృష్ణారావు 72కిలోల లడ్డూ ప్రసాదంను సమర్పించిన దృశ్యం

మండపేట, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి 69వ జన్మదిన వేడుకలను పురష్కరించుకుని తాపేశ్వరం సురుచి సంస్థ 72కిలోల లడ్డూ ప్రసాదంను మైహోమ్ అధినేత కృష్ణారావు స్వామివారికి సమర్పించామని సురుచి పీఆర్‌వో వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చినజీయర్‌స్వామి తిరునక్షత్ర వేడుకలు హైదరాబాద్‌లో ఉన్న జీయర్ ఆశ్రమంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆర్తమూరుకు చెందిన ఉభయగోదావరిజిల్లాల వికాస తరంగిణి అధ్యక్షుడు కర్రి పాపారాయుడు హాజరయ్యారు.

మంత్రి సుభాష్‌ను కలసిన ఆర్డీవో



రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన దేవరకొండ అఖిల శుక్రవారం మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో అఖిల మంత్రిని కలిసి పూలమొక్కను అందజేశారు.

తోటపేటలో పేకాట శిబిరంపై దాడి

• 14 మంది అరెస్టు.. • రూ. 45,470 నగదు స్వాధీనం

ద్రాక్షారామ, నవంబరు1: రామచంద్రపురం మండలం తోటపేటలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి 14 మందిని అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ. 45,470లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు వచ్చిన సమాచారంతో ఎస్‌ఐ లక్ష్మణ్ పోలీసు సిబ్బందితో వెళ్లి తోటపేటలో పేకాట శిబిరం నిర్వహిస్తున్న వాటర్ సర్వీసింగ్ సెంటర్‌పై దాడి చేశారు. పేకాడుతున్న 14 మందిని అరెస్టుచేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి

మండపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దేశానికి ఎనలేని సేవలు అందించిన ఉక్కుమహిళ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా వర్ధంతిని పురష్కరించుకుని పట్టణంలో రాజారత్న సెంటరులో ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్‌నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బోనం శ్రీనును అభినందిస్తున్న కమిటీ సభ్యులు

బాలభక్త సమాజం అధ్యక్షుడిగా బోనం

ద్రాక్షారామ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడిగా బోనం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాలభక్త సమాజం కమిటీ సమావేశం శుక్రవారం రాత్రి స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద జరిగింది. సమావేశంలో బోనం శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బాలభక్త సమాజం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్తీక మాసంలో ఆఖరు మంగళవారం కార్తీక దీపారాధన మహోత్సవం ఈ కమిటీ ఆధ్వర్యంలోనే జరుగనుంది.